నేటి నుంచి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు సెలక్షన్స్

దుండిగల్: జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో నాల్గో తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 21వ తేదీ నుంచి 25 వరకు సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వసంత కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. హకీంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో బాలురు, బాలికలకు సెలక్షన్స్ నిర్వహిస్తామన్నారు. అందులో ఎంపికైన వారికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గండిమైసమ్మలోని విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పేదల తలరాతలు మార్చేది విద్యే...


విద్యార్థులు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: పేదల తలరాతలు మార్చేది విద్యేనని.. ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాసాని సుధాకర్, హెడ్‌మాస్టర్ రామకృష్ణ, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాల సీజ్


పాఠశాలను సీజ్ చేస్తున్న అధికారులు

దుండిగల్: అనుమతి లేని పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో శ్రీసాయి బాలాజీ ఎన్‌క్లేవ్‌లో ఈ విద్యా సంవత్సరం శ్రీ విద్యాధర పాఠశాలలను ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించిన విద్యాశాఖ అధికారులు యాజమాన్యానికి నోటీసులు అందజేసి సీజ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారి వసంతకుమారి, మండల రిసోర్స్ పర్సన్ రమేశ్ ఉన్నారు.

ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

కుత్బుల్లాపూర్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నాయని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రెగోడ్ నగేశ్ అన్నారు. విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యాశాఖకు కనీసం మంత్రి లేకపోవడం శోచనీయమని అన్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యునిఫాం, స్టేషనరీల పేరుతో లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. పాఠశాలల్లో అటెండర్లు, స్కావెంజర్లను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యురాలు మనీషా, మేడ్చల్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ భార్గవి, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి



నిజాంపేట్: వర్షాకాలం నేపథ్యంలో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మేయర్, ఎస్ఈ సత్యనారాయణలతో పాటు వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ, నాలాలు, రోడ్ల పనులు కొనసాగుతున్నాయని అన్నారు. వాటిని మరింత త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు నెలకొన్న కాలనీలు, బస్తీల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అయా విభాగాల అధికారులను ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా ఎలక్ట్రికల్, మాన్‌సూన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలినట్లయితే సత్వర సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, చిట్ల దివాకర్, ఇంద్రజిత్‌రెడ్డి,సురేష్‌రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీరింగ్, శానిటేషన్, పారిశుద్ధ్య తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఏకపాద పించమయూరాసనం


ధనురాసనం


మహావీరాసనం


పూర్ణ నటరాజాసనం


అధోముఖ వృక్షాసనం


ఏకపాద పుష్టకౌండిన్యాసనం

యోగాతో ఆరోగ్యం

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

సుభాష్‌నగర్: మనిషి శరీరానికి మెదడుకి మధ్య ఏకత్వాన్ని లేదా సంయోగాన్ని కుదుర్చే షంషీతమైన శాస్త్రమే యోగా. యోగాశాస్త్రం అనాదిగా కొన్ని వేల సంవత్సరాలుగా మన దేశంలో ఉంది. హిమాలయాలలోని కాంతి సరోవరం వద్ద ఆదియోగా, ఆది గురువు, మహాశివుడు యోగా పరిజ్ఞానాన్ని సప్త ఋషులకి ప్రధానం చేస్తే, వారు ప్రపంచ నలుమూలలకి తీసుకపోయారని నేటి గురువులు చెబుతున్నారు. అందుకే వివిధ దేశాల ప్రాచీన సంస్కృతుల్లోని వారికి మనకు కొన్ని పోలికలు కనిపిస్తాయని ఆధునిక పరిశోధకులు చెబుతున్నారు. అయితే ఈ యోగా భారతదేశంలో పూర్తిగా అభివృద్ధి చెందడమే కాకుండా ఎంతోమంది మహాగురువుల బోధన వల్ల యోగా సాధన ప్రపంచ వ్యాప్తి చెందింది. ప్రస్తుత కాలంలో యోగా సాధన వల్ల మానసిక, శారీరక, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని యోగానిపుణులు చెబుతున్నారు.



యోగా ఉపయోగాలు..

- రోగ నిరోధక శక్తిని పెంచి, వ్యాధులను దరి చేరకుండా చేస్తుంది.
- నరాల లోపల ఏదైనా అడ్డుపడితే తొలగిస్తుంది.
- వృద్ధాప్యంతో వచ్చే ఎముకల, కీళ్ల నొప్పులకు దూరంగా ఉంచుతుంది.
- ఎముకలను దృఢంగా శక్తివంతంగా చేస్తుంది.
- అధికంగా ఆహారం తినేందుకు అడ్డుకట్ట వేస్తుంది.
- ఒత్తిడిని తగ్గిస్తుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది.
- నిద్రలేమి సమస్యను తరిమికొట్టి, నాణ్యమైన నిద్రను అందిస్తుంది.
- రక్తపోటును తగ్గించడమే కాకుండా శరీరంలో రక్తప్రసరణ మంచిగా జరిగేలా చేస్తుంది.
- తీసుకునే ఆహారం సరైన పద్ధతిలో జీర్ణమయ్యేలా దోహదపడుతుంది.
- గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీరంలోని హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి, శరీరం సరైన పద్ధతిలో పనిచేయుటకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది.

నేడు వేయి మందికి ఒకే చోట..

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శివశక్తి ధ్యాన యోగా స్టూడియో (ఎస్ఎస్‌డీ) ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లోని ఎంజే గార్డెన్ ఉచిత యోగా శిబిరానికి వేదిక కానుంది. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు యోగా గురువు కొడ మల్లేష్ ఆధ్వర్యంలో వేయి మందికి ఒకే వేదిక ద్వారా యోగా నేర్పించడానికి సన్నాహాలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగస్తులు రానున్నారు.


సుప్తడింబాసనం

నాన్నను ఆదర్శంగా తీసుకొని..



చిన్నప్పటి నుంచి నాన్నను చూసి ప్రతిరోజు యోగా చేసేవాడిని. అలా యోగా నా ఒంటికి పట్టడంతో స్థానికం నుండి అంతర్జాతీయ స్థాయి వరకు యోగా పోటీల్లో పాల్గొని అనేక బహుమతులను గెలుపొందా. ఎంబీసీ, ఎంఎస్సీ చదివిన తనకు ఇటీవల ఒక ప్రముఖ కంపెనీ నుంచి నెలకు రూ.50 వేల వేతనంతో కూడిన ఉదయం వచ్చినప్పటికీ వెళ్లకుండా ప్రతిరోజు 5 చోట్ల యోగా నేర్పిస్తున్నాను. మానసికంగా, ఇతరఅనారోగ్య సమస్యలు ఉన్నవారికి యోగా ద్వారా నయం చేశా. – పూర్ణ, యోగా గురువు

నేటి యువత తెలుసుకోవాలి...



విద్యార్థి దశ నుండి యోగా అంటే ఇష్టం. ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేసేవాడిని. 2002లో శివశక్తి ధ్యాన యోగా స్టూడియో (ఎస్ఎస్‌డీ)ని స్థాపించి, వేలాదిమందికి నేర్పించా. ఎన్నో అవార్డులను పొందాను. ఇద్దరు కుమారులు సైతం యోగా గురువులుగా ఎదిగి నేర్పిస్తున్నారు. కరోనా సమయంలో సైతం ఎవరు అధైర్యపడవద్దని ఆన్‌లైన్‌లో వేలాది మందికి ఆసనాలు నేర్పించాను. నేటి యువత చిన్నచిన్న కారణాలతో ఒత్తిడికి లోనవుతున్నారు. ఆ సమస్యల నుంచి బయటపడాలంటే ప్రతి రోజు ఒక గంట పాటు యోగా నేర్చుకోవాలి. అందుకు ప్రతి నెల ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ సిబ్బంది, వ్యాపారస్తులకు ఉచితంగా యోగా నేర్పించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నా.
– కొడ మల్లేష్, యోగా గురువు,షాపూర్‌నగర్

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

నిజాంపేట్: ఛత్రపతి శివాజీ పట్టాభిషిక్తుడైన రోజును పురస్కరించుకొని గురువారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రగతి నగర్ శివాజీ చౌరాస్తా, నిజాంపేట డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు శివాజీ చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలు, మొఘల్ పాలకులతో యుద్ధం చేసి సాధించిన అద్భుత విజయాలను పిల్లలకు తెలియజేయాలన్నారు. ఆయన గెరిల్లా యుద్ధ తంత్రాలు వియత్నాం లాంటి దేశానికి కూడా స్ఫూర్తినిచ్చిందన్నారు.

- హిందూ ధర్మ పరిరక్షణ కోసం శివాజీ చేసిన అసమాన సేవను స్మరించుకున్నారు. నేడు హిందు మతంపై, హిందువులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, నాగిశెట్టి శేషారావు, బేతి రాజా రెడ్డి, నరేంద్ర చౌదరి, రామచంద్ర నాయక్, సత్యనారాయణ, రచ్చ చక్రధర్, విజయ్, విక్రమ్, కౌశిక్ నాయుడు, పద్మ ప్రసాద్, ఎల్లా సుబ్బా రెడ్డి, బాబు నాయుడు, సూర్యనారాయణ, రామారావు, బాలచెన్నా రెడ్డి, మోహన్ రావు, సుధీర్, విశ్వనాథ్, విజయ కుమార్, ఎల్ల స్వామి, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రగతినగర్‌లో జరిగిన శివాజీ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ, వివిధ సంఘాల నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాలు, ప్రజలు ఆయనను మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి జ్ఞానేశ్వర్ గౌడ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

క్రైం కార్నర్..

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి ఉమామహేశ్వరకాలనీకి చెందిన రాజు, మౌనిక(22) భార్యాభర్తలు. ఈనెల 18న రాత్రి భోజన అనంతరం నిద్రకు ఉపక్రమించిన మౌనిక మరుసటి రోజు ఉదయం కనబడలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. మహిళ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో బాలిక..

చదువుకునేందుకు వచ్చిన ఓ బాలిక అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడకు చెందిన కల్పన కుమార్తె అనీత(15) ఈనెల 18న సుచిత్రలోని ఓంబుక్స్ క్యాంప్‌కు చదువుకునేందుకు వచ్చింది. అదేరోజు మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో తనను కలవడానికి స్నేహితులు వచ్చారని వాచ్‌మెన్‌కు చెప్పి క్యాంపస్ నుంచి బయటకు వెళ్లింది. ఇంటికి చేరుకోకపోవడంతో ఓంబుక్స్‌లో వాకబు చేసిన మైనర్ బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ కోసం యూకే వెళ్లి.. మోసపోయానని వెనుదిరిగి..

- బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన
- విదేశాల్లో ఉద్యోగం పేరిట మోసం
- నలుగురు వ్యక్తులపై కేసు నమోదు
- దర్యాప్తు చేస్తున్న బాచుపల్లి పోలీసులు

నిజాంపేట్: విదేశాల్లో జాబ్ పేరిట ఓ వ్యక్తి నుంచి లక్షల్లో నగదు తీసుకుని మోసానికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ రెడ్డి ఎవెన్యూకు చెందిన సుంకర శ్రీనివాస్ 2023, ఏప్రిల్ 17న క్రియేటీవ్ వీసా అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు చెందిన ప్రవీణ్‌రాజ్‌ను సంప్రదించాడు. అతడు యూకే టైర్ ప్లస్–2 ప్రాసెస్ విత్ జాబ్ వీసా ఇప్పిస్తానని నమ్మబలికాడు. అందుకు రూ.15.45 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో అతని మాటలు నమ్మిన శ్రీనివాస్ 2023 నవంబరు 1వ తేదీన తిరిగి ప్రవీణ్‌రాజ్‌ను సంప్రదించాడు.

- నిజాంపేట్ పాంపెల్లి విల్లాస్‌లోని సెనినెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో లక్ష్మణ్, అశోక్‌కుమార్ ఉంటారని వారికి నగదు ఇవ్వాలని చెప్పాడు. దీంతో అదే రోజు సదరు సంస్థకు శ్రీనివాస్ వెళ్లగా అశోక్ లేకపోవడంతో ప్రవీణ్‌కు కాల్‌చేయగా నగదును లక్ష్మణ్‌కు ఇవ్వమని చెప్పాడు. దీంతో రూ.14.10 లక్షలను లక్ష్మణ్‌కు, రూ.1.5 లోలను ప్రవీణ్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. వారం రోజుల తరువాత వారు శ్రీనివాస్‌కు సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ (సీఓఎస్)ను అందజేశారు.

మొదటిసారి మోసపోయి..
ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో..

- అదే విధంగా యూకేకు చెందిన పోస్టీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి సీఓఎస్‌తో పాటు ఆఫర్ లెటర్ అందింది. దీంతో శ్రీనివాస్ 2024 మార్చి 14న పోస్టీ కంపెనీకి ప్రవీణ్ వెళ్లాడు. అతని స్నేహితులు మోసం చేశారని తెలిసింది. ఈ విషయమై శ్రీనివాస్ వెంటనే ప్రవీణ్‌కు కాల్‌చేయగా జాబ్ ఉందని నమ్మించాడు. దీంతో 2024, ఏప్రిల్ 4న ఇండియాకు తిరిగొచ్చిన శ్రీనివాస్ తనను మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వారితో చెప్పాడు.

రెండోసారి నమ్మి.. మళ్లీ మోసపోయి..

- దీంతో ప్రవీణ్, లక్ష్మణ్‌లు మరోసారి అతన్ని నమ్మించి జాబ్ దొరికిందని చెప్పడంతో జూన్ 9, 2024లో మరోసారి శ్రీనివాస్ యూకేకు వెళ్లాడు. వెళ్లిన తరవాత వారిని సంప్రదించగా "నీకు డబ్బులు కావాలా? జాబ్ కావాలా?" అని చెప్పి నెంబర్ బ్లాక్ చేశారు. దీంతో ఇండియాకు వచ్చిన శ్రీనివాస్ తనకు జరిగిన మోసంపై బాచుపల్లి పోలీసులను ఆశ్రయించగా నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న బాల బృందావనం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాల బృందావనంను స్టోరీ ఆఫ్ జగదాంబ పేరిట నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకే అవకాశం కల్పిస్తారు. వివరాలకు ఫోన్: 040–23001234, 8143466670.

సమాచారం హక్కు చట్టం తేల్చేసింది 3,553 గజాల స్థలం ప్రభుత్వానిదేనని!



చింతల్: గాజులరామారావు సర్కిల్ పరిధి చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ సర్వే నం.155లోని ప్రభుత్వ స్థలం ఎప్పుడూ వివాదంలోనే ఉంటోంది. 24 ఏప్రిల్ 2024న టౌన్ ప్లానింగ్ డ్రాఫ్ట్‌మెన్ నరేష్ కుమార్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో 29 గుంటల స్థలం నుంచి 24గుంటల తగ్గించి హద్దులు నిర్ణయించారు. సుమారు సుమారు 1100 గజాల మేర తగ్గించి హద్దులు నిర్ణయించడంపై భగత్‌సింగ్‌నగర్ మాజీ అధ్యక్షుడు డి అలా బకాష్‌కి అనుమానం వచ్చింది. వెంటనే ఆయన భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ స్థల పరిరక్షణ కమిటీ తరఫున ఈ స్థలం పూర్తి వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. 19 జూన్ 2024న అతడికి సమాచారం అందింది. అందులో లొకేషన్ స్కెచ్‌తో కూడిన 3, 553 గజాల స్థలం ఉందని టౌన్‌ప్లానింగ్ అధికారులు నివేదికను పంపారని 'సాక్షి'కి తెలిపారు. భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంపై గాజులరామారం డీసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అందుకే ఆయన 1100 గజాలకు తగ్గించి హద్దులు నిర్ణయించారని ఆరోపించారు. దీంతో సమాచారంతో గాజులరామారావు సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు లుకలుకలు బహిర్గతమయ్యాయి.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం







దుండిగల్: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మేడ్చల్ జిల్లా వైద్య స్టాటిస్టికల్ అధికారి డానియెల్ సుకుమార్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యం, తీసుకునే ఆహార అలవాట్లు, వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలను వివరించాలని సూచించారు. మండల వైద్యాధికారిణి వై.నిర్మల మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 1,42,903 మంది విద్యార్థులు ఉండగా వారిలో 1,36,967 మందికి ఆల్బెండజోల్ మాత్రలను వేశామన్నారు. మిగిలిన వారికి సైతం మాత్రలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ బాలరాజు, వైద్య సిబ్బంది భారతమ్మ, లతీఫా బేగం, సత్యజ్యోతి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే సమస్యే ఉండదు..

రంగారెడ్డినగర్: డివిజన్ పరిదిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిరుమల మాట్లాడుతూ నులి పురుగుల సమస్య చిన్నారుల్లో సర్వసాధారణమని అన్నారు. పరిశుభ్రత పాటిస్తే ఆ సమస్య ఉండదన్నారు. నులి పురుగులతో బాధపడే చిన్నారుల్లో ఆకలి మందగిస్తుందని పేర్కొన్నారు. కడుపు నొప్పితో బాధ పడతారని తెలిపారు. ఇది పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు.

గత తప్పిదాలను గుర్తెరగండి
వ్యర్థాలను తొలగించండి

జీడిమెట్ల: వర్షాలు ప్రారంభం కాకముందే నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని సుభాష్‌నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నాలాల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో సుభాష్‌నగర్‌లోని పలు బస్తీల్లో ఇళ్లల్లోకి వర్షపునీరు రావడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది వర్షాలకు సాయిబాబానగర్, ఎస్.ఆర్.నాయక్‌నగర్, అపురూపా కాలనీ, జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి రాత్రి వేళ వర్షపునీరు నాలా నుంచి రావడంతో గంపలబస్తీలో నాలా మూసుకుపోయి వర్షపునీరు ఇళ్లల్లోకి చేరింది. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీశారు. అలాంటి సంఘటన పునరావృతం కాకముందే నాలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను మున్సిపల్ అధికారులు తొలగించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. కొన్ని చోట్లా చెత్తను తొలగించినప్పటికీ మరికొన్ని చోట్ల నాలాల్లో వ్యర్థాలు అలాగే మిగిలి ఉంది. వచ్చేది వర్షాకాలం కావడంతో సుభాష్‌నగర్, గంపలబస్తీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఇళ్లల్లోకి నీరు రావడానికి రీసైక్లింగ్ యూనిట్లు సైతం కారణమే..

గంపలబస్తీలో ప్రధాన నాలాకు అనుకుని వందల కొలది రీసైక్లింగ్ యూనిట్‌లు ఉన్నాయి. ప్రతి యూనిట్ ముందు పరిశ్రమ సిబ్బంది ప్లాస్టిక్ సంచుల్లో నింపిన పాత సామాన్లను, రసాయన డ్రమ్ములను బయట ఉంచుతారు. వర్షం కురిసినపుడు నీటితో పాటు ప్లాస్టిక్ డ్రమ్ములు కొట్టుకువచ్చి నాలాకు అడ్డంగా నీరు పోకుండా తట్టుకుంటున్నాయి. దీంతో నాలా నుంచి వెళ్లాల్సిన వర్షపు నీరు నాలా పై నుంచి నేరుగా ఇళ్లల్లోకి వస్తుంది.

- ఒక్కసారిగా వరద నీరు నాలా పరివాహక ప్రాంతంలోని ఇళ్లల్లోకి రావడంతో ఇళ్లు మొత్తం నీటితో నిండిపోతున్నాయి. బయంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇళ్లపైకి ఎక్కి కూర్చుంటున్నారు. ఇంటిలోని సామాన్లు మొత్తం నీటిలో తడిచిపోవడంతో దాతల సహాయం కోసం ప్రజలు నిరీక్షించాల్సి వస్తోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్, రెవెన్యూ అధికారులు ముందుగానే సర్వే నిర్వహించి నాలాల్లో చెత్తను తీసివేసి రీసైక్లింగ్ యూనిట్‌ల ముందు ఉంచిన సామాన్లను తీసివేయించాలని కోరుతున్నారు.



